# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 21-04-2016**

ప్రభుత్వ భూ వివాదాలకు సంబంధించిన కేసులు సత్వరం పరిష్కారం అయ్యే విధంగా అధికారులు చొరవ చూపాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు సంబంధించిన కేసులు రాష్ట్రంలోని అనేక కోర్టుల్లో ఏండ్ల తరబడి నడుస్తున్నాయని సిఎం అన్నారు. భూములు కేసుల్లో ఉండడం వల్ల వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించలేక పోతున్నామన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కోర్టు కేసుల్లోని ప్రభుత్వ భూములపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి మీనా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామ కృష్ణ రావు, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి సంతోష్ రెడ్డి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, సీఎంఓ అదనపు కార్యదర్శి స్మితా సభర్వాల్, టిఎస్ఐఐసి ఎండి ఎంవి నర్సింహరెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఉదాసీనత వల్ల హైదరాబాద్ నగరంలోని అనేక చోట్ల ఎంతో విలువైన భూములపై కబ్జాదారులు కన్నేయడం వల్ల వివాదాలు తలెత్తాయన్నారు. అప్పటి ప్రభుత్వం ఇలాంటి వివాదాల్లో ప్రభుత్వ భూములను కాపాడడం కన్నా, కబ్జాదారులకు అండగా ఉండడం వల్ల నష్టం జరుగుతోందని చెప్పారు. గతంలో ప్రభుత్వ అండతోనే భూముల ఆక్రమణ జరగడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను కాపాడడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇ.ఎన్.టి. ఆసుపత్రి భూ కబ్జాను అడ్డుకోగలిగామని, ప్రైవేటు పరం అయిన బొటానికల్ గార్డెన్ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోగలిగామని సిఎం గుర్తు చేశారు. మిగతా అన్ని కేసుల్లో కూడా ఇదే చిత్తశుద్ధి ప్రదర్శించి, కేసులను సత్వరం పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో మంచి లాయర్లను పెట్టుకునే అవకాశం జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని సిఎం సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని వెల్లడించారు. అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు సమన్వయంతో పని చేసి, రాష్ట్రంలోని అన్ని భూ వివాదాలను సత్వరం పరిష్కరించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, కోర్టు వివాదాల్లో ఉన్న ప్రభుత్వ భూముల జాబితా సిద్దం చేసి, ఆ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**